దుక్కులకు ఇదే అదును

- మేలు చేసిన వర్షాలు
- పొలాలను దుక్కిచేస్తున్న రైతులు


అడవికొత్తూరులో వేసవి దుక్కులు దున్నుతున్న రైతు

నగరి: ఈదురుగాలులు ఒకవైపు కొంతమేర నష్టపెట్టినా, మరోవైపు వర్షాలు రైతుకు మేలు చేశాయి. మూడు రోజులు సాయంత్రం పూట కురిసిన వర్షాలతో భూమిలో నీరు బాగా ఇంకింది. దీంతో రైతులు దుక్కులు చేపడుతున్నారు. జూన్ నుంచి వరి విత్తనాలు వేస్తారు. ఈ లోగా సాగు మేరకు వేసవి దుక్కులు చేస్తుంటారు. నగరి మండలంలో సుమారు 400 ఎకరాల వరి పంటను రైతులు రానున్న సీజన్లో సాగుచేసే అవకాశం ఉంది. దాదాపు అన్ని గ్రామాల్లో వర్షం పడడంతో మరో మూడు, నాలుగు రోజులు అనువుగా ఉంటుందని ముమ్మరంగా దుక్కులు చేసుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు.

దుక్కులతో అనేక లాభాలు

వేసవి దుక్కులతో అనేక లాభాలున్నాయి. భూమి లోపల పొరల్లో దాగి ఉండే కీటకాలు గుడ్లు, వేసవి దుక్కులు చేయడం ద్వారా బయటపడి ఎండ తీవ్రతకు చనిపోతాయి. భూమిలో కోశస్థ దశలోని క్రిమి కీటకాలు నేల పైభాగానికి రావడంతో పొలాల్లో తిరిగే కాకులు, కొంగలు, వివిధ రకాల పక్షులు వాటిని తినేస్తాయి. పంట కోత తరువాత మిగిలిన అవశేషాలు, చెత్తాచెదారం లోతుగా దుక్కులు చేయడం ద్వారా పూర్తిగా కుళ్లిపోతాయి. సేంద్రియ పదార్థంగా మారి పంటలకు బలం చేకూర్చుతాయి. కలుపు మొక్కలు చనిపోతాయి. దుక్కులతో భూమి గుల్లబారుతుంది. దీని ద్వారా వర్షం పడిన సమయంలో భూమి లోపల నీటిని నిల్వ ఉంచుకునే సామర్థ్యం పెరుగుతుంది. భూమి చల్లబడటం, ఆరిపోవడం జరుగుతుంది. విత్తనం విత్తేందుకు అనుకూలంగా ఉంటుంది. భూమి పొరల్లోకి గాలి బాగా వెళుతుంది. తద్వారా సూక్ష్మ జీవుల సాంద్రత పెరిగి సేంద్రియ కర్బనం బాగా పెరుగుతుంది.

దుక్కులకు అనుకూలం



ఇటీవల కురిసిన వర్షాలు రైతులకు కొంత మేలు చేశాయి. ప్రస్తుతం దుక్కులు దున్నడానికి అనువుగా ఉంది. లోతు వరకు నాగలి భూమిలో దిగుతోంది. ట్రాక్టర్‌తో దుక్కులు వస్తున్నాయి. ప్రతి యేటా వేసవి దుక్కులు చేస్తున్నాం. దీని వల్ల ప్రయోజనాలు కలుగుతున్నాయి. ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఆధునిక పొలం సిద్ధం చేసుకోవాలన్న ఆలోచన ఉంది. –మనోహర్, వేలావడి

రైతులకు మేలు



అకాల వర్షాలు కొంత ఇబ్బంది కలిగించినా ఎక్కువగా రైతులకు మేలు చేస్తున్నాయి. మేలో వేసవి దుక్కులు చేయడం ఎంతో మేలు. ఖరీఫ్ పంటలకు ఈ దుక్కులు ఎంతో ఉపయోగంగా ఉంటాయి. వీలున్నంత వరకు దుక్కులు చేసుకోవాలి. –రాఘవేంద్రయాదవ్, వ్యవసాయ అధికారి, నగరి మండలం

శుభ్రత అందరి బాధ్యత

నిండ్ర: మన పరిసరాలు శుభ్రతగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని వైద్యాధికారి వినీషా అన్నారు. మండల కేంద్రంలో ఆమె శనివారం ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, జర్వం ఎక్కువ రోజులు ఉంటే అది మలేరియా కావచ్చని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పరిసరాలు శుభ్రతగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ గోపి, సీహెచ్‌వో శ్రీదేవి పాల్గొన్నారు.

నాకాబందీ


స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ

నిండ్ర: మండలంలోని కొప్పేడు దళితవాడలో శనివారం సాయంత్రం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. దళితవాడలో 2 లీటర్ల నాటుసారా గుర్తించారు. రికార్డుల్లేని నాలుగు ద్విచక్ర వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో నాటు సారా అమ్మినా తయారు చేసినా చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో నగరి ఎక్సైజ్ శాఖ సీఐ శ్రీనివాసులు, నగరి రూరల్ సీఐ భాస్కర్, పోలీసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహదేవ మంగళం రోడ్డుకు మోక్షం


రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న వేలు మొదలియార్

గంగాధరనెల్లూరు: ఎట్టకేలకు మహదేవ మంగళం రోడ్డుకు మోక్షం కలిగింది. మండలంలోని మహదేవ మంగళం గ్రామానికి రాకపోకలు సాగించాలంటే గుంతల గతుకుల రోడ్డులో ఎంతో కష్టతరంగా ఉండేది. సాక్షి దినపత్రికలో రోడ్డుపై కథనం కూడా వెలువడింది. అయినా అధికారులు, కూటమి నేతలు, ప్రజా ప్రతినిధులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో సర్పంచ్ ఉమ ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్‌సీపీ నేత, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ వేలు మొదలియార్ శనివారం రోడ్డుకు మరమ్మతులు చేయించారు. దీంతో గ్రామస్తులు వేలు మొదలియార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

అధ్యాపకులు బాధ్యతగా పనిచేయాలి


బాధ్యతలు స్వీకరించిన అధ్యాపకులతో ప్రిన్సిపల్

కార్వేటినగరం: అధ్యాపకులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్ అన్నారు. శనివారం 17 మంది అధ్యాపకులు వివిధ పాఠశాలల నుంచి బదిలీపై డైట్ కళాశాలలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని, అలాగే ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

విజయపురం: మండల కేంద్రంలోని విజయపురం, ఇల్లత్తూరు 11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సదాశివం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం


పేదలకు అన్నదానం చేస్తున్న దాతలు

కార్వేటినగరం: స్థానిక రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో కార్వేటినగరానికి చెందిన దీనాకుమారి, మునికృష్ణ కుటుంబసభ్యులు అన్నదానం చేశారు. దీనా కుమారి కుటుంబసభ్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50శాతం రాయితీ ఇవ్వాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 50శాతం ఫీజు రాయితీని అందించాలని చిత్తూరు ప్రెస్‌క్లబ్, ఏపీయూడబ్ల్యూజే నాయకులు జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకులు సీఆర్ మహేష్ రెడ్డిని కోరారు. జిల్లాలోని పాత్రికేయుల పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారని, ప్రతి ఏటా జర్నలిస్టుల పిల్లలకు 50శాతం రాయితీ అందిస్తున్నారని, రానున్న విద్యా సంవత్సరంలోనూ 50శాతం ఫీజు కల్పన దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో చిత్తూరు ప్రస్తుత అధ్యక్షుడు రమేష్ బాబు ప్రధాన కార్యదర్శి కాశీశ్వర్ రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు లోకనాథన్, కార్యనిర్వాహక కార్యదర్శి అశోక్ కుమార్, నాయకులు పవన్ కుమార్, చంద్రశేఖర్, శివప్రసాద్, జయకర్, మహేష్, రామకృష్ణ, సురేష్, జీకే శివ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మురళీకృష్ణ శనివారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కంటి జబ్బు రోగులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కంటి జబ్బు రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



హైదరాబాద్, పుత్తూరులో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి ఆర్‌కే రోజా

విజయపురం: స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ శివరాజు కుమారుడు జశ్వంత్ వివాహానికి మాజీ మంత్రి ఆర్కే రోజా హాజరయ్యారు. హైదరాబాద్‌లోని విశ్వనాథ గార్డెన్స్‌లో శనివారం జరిగిన వివాహానికి ఆమె హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి దీవించారు. ఆమె వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కార్యకర్తకు పరామర్శ

వడమాలపేట మండలం పాదిరేడు వైస్ సర్పంచ్ బత్తయ్య భార్య యమునను శనివారం మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట పార్టీ కన్వీనర్ సుబ్రమణ్యం, వైస్ ఎంపీపీ లోకేష్‌రెడ్డి, వైస్ సర్పంచ్ నిరంజన్‌రెడ్డి, భరత్‌కుమార్, సుదర్శన్‌నాయుడు, చంద్రారెడ్డి, బాలా, కల్యాణ్, సదాశివయ్య, కృష్ణారెడ్డి, హరిష్, గణేష్, చంద్ర, పవన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీస్సులు

పుత్తూరు: స్థానిక ప్రైవేటు కల్యాణ మండపంలో శనివారం జరిగిన పుత్తూరు మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ వలంటీర్ విభాగం అధ్యక్షుడు యువరాజ్ వివాహ రిసెప్షన్‌లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష


మాట్లాడుతున్న హనుమంతరావు

వెదురుకుప్పం: వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి హనుమంతరావు అన్నారు. శనివారం పచ్చికాపల్లం పంచాయతీ బొమ్మన్‌దొడ్ల గ్రామంలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికమవుతున్న నేపథ్యంలో ప్రజలందరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేసవిలో నీళ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. అనవసర ప్రయాణాలను రద్దు చేసుకుని ఇళ్లల్లోనే సేదదీరాలన్నారు. బాలింతలు, గర్భిణులు సకాలంలో టీకాలు వేసుకోవాలని సూచించారు. అనంతరం వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. ఏఎన్ఎం సుధ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

నిండ్ర: మండల కేంద్రంలో శనివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనదారులలకు తప్పనిసరిగా లైసెన్స్, హెల్మెట్ ఉండాలని చెప్పారు. పలు వాహనాల రికార్డులు తనిఖీలు చేసి, వాహనదారులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అంబలి పంపిణీ


అంబలి పంపిణీ చేస్తున్న ఆలయ నిర్వాహకులు

నగరి: ఎండపట్టున వచ్చేవారికి సేద తీర్చడానికి పట్టణ పరిధి బైపాస్ కూడలిలోని ఓంశక్తి ఆలయం వద్ద ఆలయ నిర్వాహకులు అంబలి పంపిణీ చేశారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు, పాదచారులు ఆగి అంబలి సేవించి వెళ్లారు. ఎండతీవ్రత తగ్గేంత వరకు ఆలయం వద్ద అంబలి పంపిణీ చేస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

చెత్తసేకరణ కేంద్రం పరిశీలన

నిండ్ర: మండలంలోని శ్రీరామాపురం పంచాయతీలో చెత్తసేకరణ కేంద్రాన్ని శనివారం స్థానిక ఎంపీడీవో శివప్రసాద్ వర్మ, పంచాయతీ విస్తరణ అధికారి వేంకటేశులు తనిఖీ చేశారు. చెత్త సేకరణ కేంద్రం పరిశీలించారు. ప్రతి పంచాయతీలో చెత్త సేకరణ కేంద్రాలను పరిశీలించి అభివృద్ధి చేస్తామన్నారు.

పోషకాహారం తప్పనిసరి

నిండ్ర: బాలింతలు, కిశోర బాలికలు నిత్యం విధిగా పోషకాహారం తీసుకోవాలని సూపర్ వైజర్ శ్యామల సూచించారు. ఆమె శనివారం మండలంలోని ఎలకాటూరు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. బాలింతలు, కిశోర బాలికలు తీసుకోవలసిన ఆహారం, శుభ్రత, చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవం.. పరిపూర్ణం


విశేష అలంకరణలో నందీశ్వరుడు

పుత్తూరు: పట్టణంలోని ప్రముఖ శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం సాయంత్రం జరిగిన ధ్వజావరోహణంతో పరిపూర్ణమయ్యాయి. ఉదయం ఆలయంలోని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం తీర్థవారి ఉత్సవం, మూలవర్లకు కలశాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు చివరి రోజున కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం 6 గంటలకు శాస్త్రోక్తంగా ధ్వజావరోహణ కార్యక్రమాన్ని వేద పండితులు నిర్వహించారు. అనంతరం రాత్రి 8 గంటలకు ఏకాంత సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు పి.రాజశేఖర్‌వర్మ కుటుంబ సభ్యులు, కోలా పెద్దమునెమ్మ స్పెసిపిక్ ఎండోమెంట్స్, పి.శివయ్య బ్రదర్స్ ఉభయదారులుగా వ్యవహరించారు.

నందీశ్వరుడికి ప్రదోష పూజలు

స్థానిక శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రదోషకాల పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నందీశ్వరుడికి అభిషేకం చేశారు. సదాశివేశ్వరుడికి, నందికి ఏకకాలంలో కర్పూర హారతులిచ్చారు. ప్రదోష పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవం


మాతృమూర్తులకు పాదాభివందనం చేస్తున్న పిల్లలు

పుత్తూరు: మండల పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక కామరాజ్‌నగర్, రజక కాలనీ, గేట్‌పుత్తూరు కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీఓ ప్రమీల పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతిలో తల్లి ప్రేమకు ఏదీ సాటి లేదన్నారు. పిల్లల జీవితాల్లో, వారి భవిష్యత్‌పై తల్లి ప్రేమ సుస్పష్టమని తెలిపారు. పిల్లలు ఎంత ఎదిగినా తల్లి దండ్రులను చివరి వరకు గౌరవించాలని అన్నారు. పిల్లలకు తల్లిదండ్రుల గురించి వివరించాల్సిన గురుతర బాధ్యత అంగన్‌వాడీ వర్కర్లపై ఉందన్నారు. పిల్లలందరిని వారి వారి తల్లులకు పాదాభివందనం చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు గీతాంజలి, వర్కర్లు పాల్గొన్నారు.

ఆంగ్ల ఉపాధ్యాయులకు శిక్షణ


శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు

పుత్తూరు: ఆంగ్ల ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముంబయికి చెందిన కొటక్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్‌తో కలిసి అంబేడ్కర్ గురుకుల పాఠశాల సంయుక్తంగా శిక్షణ తరగతులు నిర్వహించారు. తిరుపతిలోని హోటల్ గ్రాండ్ ఆర్చిడ్‌లో శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 9 నుంచి 11 వరకు మూడు రోజుల పాటు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త గీతా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో మదర్స్‌డే

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం పూడి ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా మదర్స్ డే నిర్వహించారు. దీన్ని పురస్కరించుకొని శనివారం తల్లికి వందనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టీచర్ చంద్రమ్మ తల్లి యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం పిల్లలు తమ తల్లులకు పాద పూజలు చేశారు. తల్లీబిడ్డ అనుబంధం గురించి బొమ్మల రూపంలో పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వసంత, మునికన్నెమ్మ పాల్గొన్నారు.


పిల్లలు తమ తల్లులకు పాద పూజ చేస్తున్న దృశ్యం

ఆస్పత్రిలో పనిచేయని లిఫ్ట్


రోగులను వీల్‌చైర్‌లో తీసుకెళుతున్న సిబ్బంది

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మూడురోజులుగా లిఫ్ట్ పనిచేయడం లేదు. దీంతో రోగులు పై మూడు అంతస్తులకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. ఇక నడవలేని పరిస్థితుల్లో ఉన్న రోగులను పైకి తీసుకెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. వీల్‌చైర్‌పై తోయలేక తోసుకెళుతున్నారు. అధికారులు స్పందించి లిఫ్ట్‌కు మరమ్మతులు చేయించాలని రోగులు వేడుకుంటున్నారు.

భక్తిప్రపత్తులతో ప్రదోష పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్ కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రదోష పూజలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. వేకువజామునే సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి దూపదీప నైవేద్యాలు సమర్పించి అభిషేకం చేశారు. సాయంత్రం నందీశ్వరుడిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. నందీశ్వరుడికి శివునికి ఏకకాలంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శనిత్రయోదశిని పురష్కరించుకుని శనీశ్వరునికి అభిషేకం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


పాము కాటుకు దివ్యాంగుడు మృతి



దేవానందం మృతదేహం, పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు

పాలసముద్రం: మండల కేంద్రంలో ఓ వ్యక్తి పాము కాటుకు గురై మృతిచెందాడు. కుటుంబసభ్యుల వివారల మేరకు మునస్వామిమందడి కుమారుడు ఎస్.దేవానందం(52) దివ్యాంగుడు. ఇతను ఇంటి వద్ద ఉండగా శనివారం మధ్యాహ్నంపాము కాటుకు గురయ్యాడు. వెంటనే అతన్ని బంధువులు పాలసముద్రం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ సిబ్బంది పాము కాటుకు మందులేదని చెప్పడానికి రెండు గంటలు సమయం తీసుకుని టీటీ ఇంజక్షన్ వేసి చిత్తూరుకు రెఫర్ చేశారు. వెంటనే అతన్ని 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి బంధువులు పీహెచ్‌సీలో సక్రమంగా వైద్యం అందించక పోవడంవల్లే మృతిచెందాడని పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేశారు.

ఖాళీ మద్యం సీసాల కలకలం



షెడ్డులో ఉన్న ఖాళీ మద్యం సీసాలు, సంచుల నిండా ఉన్న సీసాలను చూపుతున్న రైతు

విజయపురం: మండలంలోని పిలాసపాలెం రోడ్డు ఆనుకొని ఉన్న మామిడి తోటలో రైతు నిర్మించుకున్న షెడ్డులో కొత్త ఖాళీ మద్యం సీసాలు కలకలం రేపాయి. జగన్నాథపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మునికృష్ణకు పన్నూరు–పిలాసపాలెం రోడ్డు పక్కనే మామిడి తోట ఉంది. అందులో ఒక షెడ్డు కూడా ఉంది. అయితే శనివారం తోటకు వెళ్లిన రైతుకు షెడ్డులో ఉన్న 40 బస్తాల కొత్త ఖాళీ మద్యం సీసాలు చూసి విస్తుపోయాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నకిలీ మద్యం తయారీ కోసమేనా?

రైతులు పొలంలో ఉన్న ఖాళీ మద్యం సీసాలు చూసిన స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నకిలీ మద్యం తయారీ కోసం ఎవరో ఇక్కడ ఖాళీ మద్యం సీసాలు సిద్ధం చేసి ఉంటారని ఆరోపిస్తున్నారు. తమిళనాడు సరిహద్దు ప్రాంతం కావడంతో నకిలీ మద్యం తయారీకి కేంద్రంగా ఏర్పాటు చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత స్థాయి అధికారులు బయటపడ్డ కొత్త మద్యం సీసాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా వారు స్పందించలేదు.